హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442

యాదాద్రి :1800 425 7106


సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	178	203
సూర్యాపేట	రూ.120	175	200
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4 । కనిష్ఠం 20.0



ఎట్టకేలకు లక్ష్యం దిశగా..

సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగింత ఎట్టకేలకు లక్ష్యం దిశగా సాగుతోంది. 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ ప్రభుత్వానికి అప్పగింతలో యాదాద్రి, నల్లగొండ జిల్లాలు ముందున్నాయి. ఈ రెండు జిల్లాల్లో మిల్లర్లు ఎఫ్‌సీఐ(ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి ఇవ్వాల్సిన బియ్యం 100శాతం మేర పూర్తయి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచాయి. సూర్యాపేట జిల్లాలో 90శాతం మేర సీఎంఆర్ పూర్తయింది.

●ఆంధ్రజ్యోతి-యాదాద్రి, సూర్యాపేట/నల్లగొండ

- 2022-23 వానాకాలం సీఎంఆర్ అందజేసిన మిల్లర్లు
- సూర్యాపేట జిల్లాలో 90శాతం మేర
- యాదాద్రి, నల్లగొండ జిల్లాలో 100శాతం

జిల్లా యంత్రాంగం వానాకాలంలో రైతుల వద్ద సేకరించిన ధాన్యాన్ని జిల్లాల్లోని మిల్లర్లకు రవాణా చేసి, మిల్లింగ్ అనంతరం సీఎంఆర్ బియ్యాన్ని ప్రజాపంపిణీకి వినియోగిస్తారు. అయితే వానాకాలంలో మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ బియ్యం డిసెంబరు వరకు కూడా పలువురు ఎఫ్‌సీఐకి, పౌరసరఫరాలశాఖకు అప్పగించలేదు. ఈ నేపథ్యంలో వానాకాలంలో పౌరసరఫరాలశాఖ ద్వారా మిల్లర్లకు పంపిణీ చేసిన బియ్యం ఇప్పటికే పెండింగ్‌లో ఉండటాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పౌరసరఫరాలశాఖ అధికారులు మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి బియ్యం నిల్వల్లో భారీ తేడాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో సీఎంఆర్‌పై జిల్లాస్థాయిలో సమీక్షించి, బకాయిలు ఉన్న మిల్లుల్లో తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయా జిల్లాల్లో సీఎంఆర్ అప్పగించని మిల్లుల్లో ధాన్యం కేటాయింపు, ప్రస్తుతం ఉన్న అధికారులు స్టాక్‌ను తనిఖీచేశారు. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మిల్లులపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి చివరికి లక్ష్యాన్ని చేరుకుంది.

రెండు జిల్లాల్లో 100శాతం

యాదాద్రి, నల్లగొండ జిల్లాలో 2022-23 వానాకాలంలో సీఎంఆర్ 100శాతం మేర వచ్చింది. సూర్యాపేట జిల్లాలో 90శాతం మేర రావాల్సి ఉంది. యాదాద్రి జిల్లాలో 2,85,218 మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుమతి కాగా, సీఎంఆర్‌కు 1,91,750మెట్రిక్‌టన్నులు కేటాయించారు. కాగా, 1,90,951 మెట్రిక్‌టన్నుల ధాన్యం ఎఫ్‌సీఐకి మిల్లర్లు అప్పగించారు. మరో 799 మెట్రిక్‌టన్నులు అందించాల్సి ఉంది. నల్లగొండ జిల్లాలో వానాకాలంలో 4,44,576 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి కాగా, సీఎంఆర్‌కు 2,98,723 మెట్రిక్ టన్నులు కేటాయించారు. ఇప్పటివరకు 2,97,605మెట్రిక్ టన్నుల ధాన్యం ఎఫ్‌ఐసీకి అప్పగించారు. మరో 1,118 మెట్రిక్ టన్నులు ఇవాల్సి ఉంది. సూర్యాపేట జిల్లాలో 3,13,333మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి కాగా, సీఎంఆర్‌కు 2,10,701 మెట్రిక్ టన్నులు 59 మిల్లులకు కేటాయించారు. ఇప్పటివరకు 1,78,182మెట్రిక్ టన్నుల వరకు మిల్లర్లు అందజేశారు. మరో 32,518మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అందించాల్సి ఉంది.

పూర్తికాని యాసంగి సీఎంఆర్

2022-23లోయాసంగిలో ఇచ్చిన సీఎంఆర్ నేటికీ 50శాతం కూడా పూర్తికాలేదు.యాసంగిలో రైతులవద్ద సేకరించిన సీఎంఆర్‌ను అందించేందుకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. నల్లగొండ జిల్లాలో మొత్తం 6,91,779మెట్రిక్ టన్నుల ధాన్యానికి సీఎంఆర్‌కు 4,66,950మెట్రిక్ టన్నులు కేటాయించారు. కాగా, ఇప్పటివరకు 1,95,924మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐకి మిల్లర్లు తిరిగి అప్పగించారు. మొత్తం ధాన్యంలో 42శాతం మేరకు ఎఫ్‌సీఐకి చేరింది. యాదాద్రి జిల్లాలో ధాన్యం 4,11,182మెట్రిక్‌టన్నుల దిగుబడికి సీఎంఆర్‌కు 2,77,428టన్నులు అప్పగించారు.ఇప్పటివరకు 1,08,208మెట్రిక్ టన్నులు తిరిగిఎఫ్‌సీఐకి చేరింది. 39శాతం మేర సీఎంఆర్ తిరిగి వచ్చింది. సూర్యాపేట జిల్లాలో మొత్తం 3,61,445 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సీఎంఆర్‌కు 2,43,479 మెట్రిక్ టన్నులు కేటాయించారు. కాగా, ఇప్పటివరకు 22,675 మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐకి తిరిగి వచ్చింది.

ధాన్యం నిల్వల్లో వ్యత్యాసముంటే చర్యలు

యాసంగిలో సేకరించిన ధాన్యాన్ని వెంటనే సీఎంఆర్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పౌరసరఫరాల శాఖ రైస్ మిల్లులకు కేటాయించిన నిల్వలు,మిల్లుల్లో ఉన్నస్టాక్‌కు మధ్య వ్యత్యాసం ఉన్న పక్షంలో సంబంధిత మిల్లర్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోనుంది. ఈమేరకు రైస్‌మిల్లుల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.సీఎంఆర్ పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై చర్యలు తీసుకోవాలి

కోదాడ రూరల్: మిల్లులకు అప్పగించిన ధాన్యానికి సంబంధించి జనవరి 31వరకు గడువులోగా సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త సుందరవెల్లి బసవయ్య శనివారం కలెక్టర్‌కు పంపిన వినతిపత్రంలో కోరారు. కోదాడ మండలంలోని కొమరబండ గ్రామానికి చెందిన ఎస్వీఆర్ రైస్‌మిల్లుకు 2022-23లో రూ.60కోట్ల విలువైన ధాన్యాన్ని ప్రభుత్వం ఇవ్వగా,నేటికీ సంబంధిత మిల్లర్ సీఎంఆర్‌ను అందజేయలేదని, ఆ మొత్తాన్ని ఇతర రాష్ట్రాల్లో విక్రయించినట్టు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గతంలో ధాన్యం విక్రయించిన మిల్లులపై కేసులు

గతంలో సీఎంఆర్ ధాన్యం విక్రయించిన వారిపై కేసులు నమోదయ్యాయి. విచారణ కూడా సాగుతోంది. 2022-23 యాసంగికి సంబంధించి 10శాతం మాత్రమే బియ్యాన్ని మిల్లర్లు అందజేశారు. మిగిలిన 90శాతం బియ్యంపై దృష్టి సారించాం.

- మోహన్‌బాబు, సూర్యాపేట జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి



భువనగిరిలోని రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, తదితరులు (ఫైల్)

గత సీఎంఆర్ పరిస్థితి ఏంటి?

సూర్యాపేట జిల్లాలో 2022-23 యాసంగిలో మిల్లర్లకు కేటాయించిన ధాన్యంలో 10శాతం మాత్రమే తిరిగి అప్పగించారు. కోదాడలోని ఎస్‌వీఆర్ పార్‌బాయిల్డ్ మిల్లుకు 2021-22 వానాకాలంలో 23,325 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా ప్రభుత్వానికి కేవలం 5564.814 మెట్రిక్ టన్నుల (రా రైస్) బియ్యాన్ని అందజేశారు. 2022-23 యాసంగిలో 15,535 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కస్టం మిల్లింగ్‌కు ఇస్తే అక్రమంగా పక్కదారి పట్టించారు. కోదాడ మండలం కాపుగల్లులోని ఉషశ్రీ పారబాయిల్డ్ రైస్ మిల్లుకు 2020-21 వానాకాలంలో 17,433 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇవ్వగా 10,640 మెట్రిక్ టన్నులు మాత్రమే అప్పగించారు. యాసంగిలో 9,954 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కస్టం మిల్లింగ్‌కు ఇవ్వగా, కేవలం 261 మెట్రిక్‌టన్నులు అప్పగించి మిగతా బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. ఈ మిల్లు యజమానిపై అధికారులు కేసు నమోదు చేశారు. 2020-21, 2021-22 సీజన్లలో ఐదు రైస్ మిల్లుల యజమానులు పెద్ద మొత్తంలో ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. కనీసం బ్యాంక్ గ్యారెంటీ లేకుండా ప్రభుత్వం ధాన్యం అప్పగించడంతో మిల్లర్లు వాటిని పక్కదారి పట్టించారు. దీంతో కోట్ల రూపాయలు మిల్లర్ల పరమయ్యాయి. ఇటీవల గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో సూర్యాపేటకు చెందిన ఓ మిల్లు యజమానిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో ఆయన్ను విడుదల చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. పేట జిల్లాలో 2022-23 యాసంగి, 2022-24 వానాకాలానికి సంబంధించి సుమారు రూ.850కోట్ల మేర సీఎంఆర్ బకాయి ఉన్నట్టు ప్రాథమిక సమాచారం. నల్లగొండ జిల్లాలో 139 మిల్లులకు 2022-23 రబీలో 6,91,779మెట్రిక్ టన్నుల ధాన్యానికి సీఎంఆర్‌కు 4,66,950మెట్రిక్ టన్నులు కేటాయించారు. కాగా, ఇప్పటివరకు 1,95,924మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐకి మిల్లర్లు తిరిగి అప్పగించారు. 3,91,073 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుల్లో నిల్వ ఉంది.

భయపెడుతున్న క్షయ

ఉమ్మడి జిల్లాలో రెండేళ్లుగా 12,942 మందిలో రోగ లక్షణాలు, 289 మంది మృతి

పౌష్టికాహారం, రోగనిరోధక శక్తి లేమితో సోకుతున్న టీబీ



భువనగిరిటౌన్, ఫిబ్రవరి3: క్షయవ్యాధి ఉమ్మడి జిల్లా ప్రజలను భయపెడుతోంది. ఉపాధి అవకాశాలు మెరుగై జీవన ప్రమాణాలు పెరిగాయని అందరూ భావిస్తున్న తరుణంలో పలు రూపాల్లో ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తున్నప్పటికీ రోగ నిరోధక శక్తి, పౌష్టికాహార లేమితో ఈ వ్యాధి విజృంభిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. వ్యాధి లక్షణాలు, వ్యాధి కారకాలపై కొరవడిన అవగాహన లోపంతోపాటు ప్రజల నిర్లక్ష్యంతో క్షయ (టీబీ) వ్యాపిస్తోందని వైద్య నిపుణులు అంటున్నారు. కష్టార్జితంతో సంపాదించిన మొత్తంతో రోజువారీగా సమతుల్య లేదా పరిమితంగానైనా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఇతర వ్యసనాలకు లోనవుతుండడం కూడా టీబీ వ్యాధి వ్యాప్తికి పరోక్ష కారణమవుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు, మందులు అందిస్తుండడంతో వ్యాధినుంచి కొంత మంది విముక్తి పొందుతున్నారు. అయినప్పటికీ నిర్లక్ష్యం చూపిన వారు మాత్రం ఈమేరకు గత రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో 12,942 మంది వ్యాధిబారిన పడగా, 289 మంది మృత్యువాత పడడం క్షయవ్యాధి తీవ్రతను తెలియజేస్తోంది.

అవగాహనా లోపంతోనే వ్యాధి వ్యాప్తి

అవగాహనా లోపంతోనే టీబీ వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతోపాటు పౌష్టికాహార లేమి టీబీ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారణమవుతోంది. అలాగే రోగ లక్షణాలపై అవగాహన కొరవడటంతో కూడా సకాలంలో వైద్య చికిత్సలు, మందులు తీసుకోలేకపోతున్నారు. వాస్తవానికి వ్యాధి సోకిన వారు వైద్య చికిత్సలు, మందులు స్వీకరిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలి. వ్యాధి తీవ్రత ఆధారంగా 6 నుంచి 12 నెలలు, మరికొంత మందికి రెండేళ్ల వరకు చికిత్సలు అందిస్తారు. ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా వ్యాధి తీవ్రత పెరిగి మృత్యువుకు చేరువవుతారు. నిరంతర దగ్గు, తుమ్ములు, జ్వరం, తెమడతో కూడిన ఉమ్మి వస్తుంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రుల్లో తెమడ పరీక్షను నిర్వహించుకుంటే వ్యాధి నిర్ధారణ అవుతుంది. తెమడ పరీక్షలో తేలకుంటే ఎక్స్‌రేలో మరింత స్పష్టత వస్తుంది. ప్రతీ పీహెచ్‌సీలో తెమడ పరీక్షలు అందుబాటులో ఉంటాయి. అలాగే పీహెచ్‌సీతోపాటు అన్ని స్థాయిల ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్సలు, మందులు, నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాధి సోకిన వారు పౌష్టికాహారం తీసుకునేలా కేంద్ర ప్రభుత్వం ప్రతీ నెల రూ.500 వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుంది. అయితే హెచ్‌ఐవీ సోకిన వారిలో మాత్రం అధిక మందికి టీబీ సహజ సిద్ధంగా వస్తుంది. అయినప్పటికీ పలువురు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోకుండానే కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది.

టీబీ అంటువ్యాధి

టీబీ ప్రాణాంతకం కానప్పటికీ అంటు వ్యాధి. వ్యాధి సోకిన వారి తుమ్ములు, దగ్గు ద్వారా వెలువడే క్రిముల ద్వారా ఇతరులకు వ్యాధి సోకుతుంది. అయితే వ్యాధి నిరోధక శక్తి ఉన్న, పౌష్టికాహారం తీసుకునే వారి దరిదాపులకు మాత్రం టీబీ వ్యాధి రాదు. కుటుంబంలో ఏ ఒక్కరికి వ్యాధి సోకినప్పటికీ తగ్గే వరకు మిగతా సభ్యులందరూ జాగ్రత్తగా ఉండాల్సిందే. అలాగే వ్యాధి గ్రస్థులు కూడా తుమ్ములు, దగ్గు సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. మందులతోపాటు వేడి ఆహార పదార్థాలను, పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి.

రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో రెండేళ్లుగా 12,942 మంది టీబీ వ్యాధి బారినపడ్డారు. వైద్య చికిత్సలతో 9,452 మంది కోలుకోగా నిర్లక్ష్యం చూపిన 286 మందిలో వ్యాధి తీవ్రత పెరిగింది. మరో 289 మం ది మృతి చెందడం క్షయ వ్యాధి తీవ్రతను తెలియజేస్తున్నది. మిగతా 2,915 మంది రెగ్యులర్ చికిత్సలు పొందుతున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట జిల్లాలో క్షయ వ్యాధి మృతులు అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తున్న అంశం.



ఉమ్మడి జిల్లాలో క్షయ రోగులు ఇలా..

జిల్లా	సంవత్సరం	రోగులు	తగ్గినవారు	ముదిరిన కేసులు	మృతులు
యాదాద్రి	2022	1,490	1,464	34	11
	2023	1,420	1,368	31	21
నల్లగొండ	2022	2,980	2,825	60	67
	2023	2,605	1,205	47	43
సూర్యాపేట	2022	2,220	2,039	17	88
	2023	2,227	1,064	97	39

జాగ్రత్తలతో అరికట్టవచ్చు



జాగ్రత్తలు, సకాలంలో చికిత్స పొందితే క్షయ వ్యాధిని నియంత్రించవచ్చు. అలాగే అందరూ విధిగా పౌష్టిక, సమతుల్య ఆహారం తీసుకుంటే మరింత మంచిది. వ్యాధి లక్షణాలు సోకిన వారు వెంటనే స్థానిక పీహెచ్‌సీ, ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో తెమడ పరీక్ష చేయించుకోవాలి. మరింత స్పష్టత కోసం ఎక్స్‌రే తీయించుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా రోగ నిర్ధారణ, చికిత్సలు, మందులు లభిస్తాయి.

- డాక్టర్ వై.పాపారావు, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి, యాదాద్రి

ప్రత్యేక అధికారులు సమర్ధంగా పని చేయాలి

వీడియో కాన్ఫరెన్సులో పంచాయత్ రాజ్ శాఖ మంత్రి సీతక్క



పాల్గొన్న జిల్లా అధికారులు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3: ప్రత్యేక అధికారులు ప్రతీ పంచాయతీలో సమర్ధంగా పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క ఆదేశించారు. శనివారం పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. ప్రతీ గ్రామపంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీవరకు ప్రతీ గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలన్నారు. గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసినందున మళ్లీ పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారులు కొనసాగుతారని తెలిపారు. ప్రతీ గ్రామానికి ఒక ప్రత్యేక అధికారిని నిమించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ కలెక్టర్లు ప్రత్యేక అధికారులకు ఒకరోజు శిక్షణ ఇవ్వాలని, గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య రాకుండా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. నీటి ట్యాంకులను ప్రతీ 10 రోజులకు ఒకసారి పరిశుభ్రం చేయాలన్నారు. గ్రామాలవారీగా పైపులైన్‌లను పరిశీలించి లీకేజీలు అరికట్టాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీవో కాళిందిని, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ తిరుపతయ్య, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్స్

నల్లగొండ, ఫిబ్రవరి 3: జిల్లాలో మూడో రోజు శనివారం నాడు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు జనరల్ విభాగంలో మొత్తం 1422 మందికి 1389 మంది విద్యార్థులు హాజరుకాగా, 33 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,584 మంది విద్యార్థులకు గాను 1,390మంది హాజరు కాగా 194 గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు జనరల్ విభాగంలో 1,318 మందికి 1282 మంది హాజరుకాగా 36 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,522 మందికి 1,411 మంది హాజరుకాగా 111 మంది పరీక్షలకు హాజరుకాలేదు.

డిండిలో ప్రాక్టికల్స్ విధుల నుంచి సిబ్బంది తొలగింపు

డిండిలోని శ్రీవేంకటేశ్వర వొకేషనల్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు లేకుండా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోపణలు రావడంతో కన్వీనర్, డీఐఈవో దస్రునాయక్ సిబ్బందిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. ఎంక్వయిరీ కమిటీ రిపోర్టు ప్రకారం విధుల్లో ఉన్న చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్ ఎగ్జామినర్లను తొలగించినట్లు తెలిపారు.

నల్లగొండ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న గంగిడి మనోహర్‌రెడ్డి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి

రామగిరి, ఫిబ్రవరి 3: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ స్థానాన్ని కైవసం చేసుకుంటామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతోందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ సమర్థ పాలన అందిస్తూ దేశాన్ని బలోపేతం చేస్తున్నారన్నారు. ప్రపంచంలో దేశాన్ని మూడో బలమైన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.బీజేపీని ఓడించేందుకు ఏర్పడిన ఇండియా కూటమి ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలవాలని చూస్తోందన్నారు. వారి సొంత రాష్ట్రాల్లో డిపాజిట్లు రానివారు కూటమిగా ఏర్పడ్డారని ఎద్దేవా చేశారు.యువతను బీజేపీ ఓటర్లుగా మలుచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నూకల నరసింహారెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, కళ్యాణ్‌నాయక్, సాధినేని శ్రీనివాస్‌రెడ్డి, దోనూరు వీరారెడ్డి, మొగులయ్య, కంకణాల నివేదిత, సాంబయ్య పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు వీడాలి

ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, ఫిబ్రవరి 3: నేటి సమాజంలో సైన్స్ ద్వారా ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నామని, ఇలాంటి తరుణంలో ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శనివారం హాలియా టైం పాఠశాలలో జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో చెకుముకి సైన్స్ ప్రదర్శనల బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సైన్స్ విజ్ఞానం ద్వారా మనదేశంలో శాస్త్రవేత్తలు అద్భుతాలు సృష్టిస్తున్నట్లు ప్రశంసించారు. విద్యార్థులు కూడా తమ సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ దోహదపడుతుందన్నారు.

అనంతరం విద్యార్థులకు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చెకుముకి జిల్లాస్థాయి టెస్ట్‌లో చక్కని ప్రతిభచూపి మూడు విభాగాల్లో మూడు పాఠశాలలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. జనగాం జిల్లా కేంద్రంలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాల్లో ఈ పాఠశాలలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఇంగ్లీష్ మీడియం ప్రైవేటు పాఠశాలల విభాగంలో నల్లగొండలోని అరవింద్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఇంగ్లీష్ మీడియం నుంచి వేములపల్లి మండలం అమనగల్ జడ్పీ ఉన్నత పాఠశాల, తెలుగు మీడియం విభాగంలో మిర్యాలగూడ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో తిరుమలగిరి ఎంపీపీ భగవాన్‌నాయక్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి నన్నూరి వెంకటరమణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, అమరయ్య, మహిళా నాయకురాలు విమల, వంగూరి శ్రీనివాస్, టైం పాఠశాల ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, డైరెక్టర్ మందా నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలే

ఎస్పీ చందనా దీప్తి



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నల్లగొండ టౌన్, జనవరి 3: మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని ఎస్పీ చందనాదీప్తి హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 44 మందిని శనివారం జేఎఫ్‌ఎస్ఎం కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, ఒకరికి రెండు రోజుల జైలు, ముగ్గురికి ఒక రోజు జైలు, రూ.2వేల చొప్పున జరినామా విధించారు. మిగిలిన 40మందికి రూ.34వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలపై అందరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ డానియల్ పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

● ఆర్డీవో, రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న బాధిత రైతులు

వలిగొండ, ఫిబ్రవరి 3: రీజనల్ రింగురోడ్డు అలైన్మెంట్‌ను మార్చాలని డిమాండ్ ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వర్కట్‌పల్లి గ్రామంలో భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన చేపట్టారు. శనివారం ఆ గ్రామానికి వచ్చిన చౌటుప్పల్ ఆర్డీవో జగన్నాథరావును, రెవెన్యూ సిబ్బందిని బాధిత రైతులు అడ్డుకున్నారు. గతంలో గ్యాస్‌లైన్, కాళేశ్వరం లైన్ గౌరెల్లి నుంచి ఖమ్మం రోడ్డుకు తమ భూములు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన భూములు రీజనల్ రింగురోడ్డు వల్ల కోల్పోతే జీవనాధారం కోల్పోతాయని అన్నారు. భూమికి బదులు భూమి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు జనార్ధన్‌రెడ్డి, గిరిబాబు, సత్యనారాయణ, వెంకటయ్య, కృష్ణ, దశరథ, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.



వర్కట్‌పల్లిలో ఆర్డీవోతో మాట్లాడుతున్న ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు

పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్‌లోకి మహిళ

● గుర్తించి అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్

● మామ ఇన్సూరెన్స్ డబ్బు కోసం ఏడాదిగా చక్కర్లు



బాధిత మహిళ నిర్మల

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్‌కు వచ్చిన మహిళను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... చివ్వెంల మండలం ఐలాపురం గ్రామానికి చెందిన బుడిగ వెంకటయ్య భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. అతడికి కార్మికశాఖ జారీచేసిన లేబర్‌కార్డు ఉంది. ఏడాది క్రితం వెంకటయ్య మృతి చెందగా, కార్మికశాఖ నుంచి ఇన్సూరెన్స్ పొందేందుకు ఆయన కోడలు బుడిగె నిర్మల దరఖాస్తు చేసింది. ఏడాదిగా ఇన్సూరెన్స్ డబ్బుల కోసం సూర్యాపేట అసిస్టెంట్ లేబర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా డబ్బు మంజూరు కావడం లేదు. డబ్బు రాకుండా కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టరేట్‌లో ఆత్మహత్య చేసుకోవాలని భావించి ఆమె వెంట పెట్రోల్ బాటిల్ తీసుకొని శనివారం సాయంత్రం సూర్యాపేట కలెక్టరేట్‌కు వచ్చింది. కలెక్టరేట్ లోపల సమావేశ మందిరం వద్ద విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ రాజశేఖర్ ఆమె వెంట తెచ్చుకున్న సంచిని చూసి అనుమానంతో తనిఖీ చేశాడు. సంచిలో పెట్రోల్ బాటిల్ ఉండడంతో బాటిల్‌తో పాటు ఆమెను కూడా అదుపులోకి తీసుకున్నాడు. ఆమెను అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి వద్దకు తీసుకెళ్లాడు. దీంతో తన సమస్యను అదనపు కలెక్టర్ వెంకటరెడ్డికి వివరించింది. స్పందించిన ఆయన దరఖాస్తును పరిశీలించి త్వరగా ఇన్సూరెన్స్ డబ్బు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌ను పోలీసులు తీసుకొని పంపించారు.



కానిస్టేబుల్ స్వాధీనం చేసుకున్న పెట్రోల్ బాటిల్

అధికారులు వేధిస్తున్నారని ఉద్యోగి నిరసన



ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న రాజ్యలక్ష్మి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3: అధికారులు తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఓ ఉద్యోగి నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం ఇరిగేషన్ ఈఈ కార్యాలయ ఎదుట శనివారం ఆందోళన చేసింది. అధికారులు తనను వేధింపులకు గురిచేస్తున్నారని ఇరిగేషన్‌శాఖ డివిజన్ నెం-3లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్. పావని రాజ్యలక్ష్మి నాగార్జునసాగర్ ఎస్ఈకి రాసిన లేఖను చూపుతూ కార్యాల యం ఎదుట బైఠాయించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈఈ కార్యాలయ సూపరింటెండెంట్, డీఏవో, ఈఈలు తనను తీవ్ర పని ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. సీనియర్ అసిస్టెంట్ చేయాల్సిన పనులు తన అప్పగించి పనిభారం పెంచారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆ పనులు చేయకపోతే ప్రొబెషన్ కాలంలో ఉన్న తనను పర్మినెంట్ చేయబోమని, సెలవులు మంజూరు చేయమని, ఎస్ఈకి సరెండర్ చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపింది. ఉన్నతాధికారి స్పందించి తనకు న్యాయం చేయాలని కోరింది. ఈ విషయాన్ని మీడియా ద్వారా అధికారులకు తెలియజేసేందుకే తాను నిరసనకు చేస్తున్నాని పేర్కొంది. అనంతరం నిరసన విరమించి విధులకు హాజరైంది. సమాచారం తెలుసుకున్న పట్టణ టూటౌన్ పోలీసులు కార్యాలయానికి వచ్చి వేధింపుల విషయమై పావనిని అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సాయం కావల్సివస్తే నేరుగా 100కు డయల్ చేయాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యాలయంలో ఈఈ అందుబాటులో లేనందున ఈ విషయమై డీఏవో లక్ష్మీబాయిని ప్రశ్నించగా, కార్యాలయంలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు ఒక్కరే ఉన్నారని, మరొకరు డిప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చి పనిచేస్తున్నారని తెలిపారు. పావనిపై పని ఒత్తిడి లేదని, ఆమె చేయాల్సిన పనులే పెండింగ్‌లో ఉంటే ఇతర అధికారులు చేస్తున్నారని పేర్కొన్నారు.

కారు పల్టీ.. నలుగురికి గాయాలు

మోత్కూరు, ఫిబ్రవరి 3: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలో తుర్కలషాపురం క్రాస్‌రోడ్డు వద్ద శనివారం కారు పల్టీకొట్టి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పీవీసీ ఫిటింగ్స్ మార్కెటింగ్ చేసే శ్రీకాంత్‌రెడ్డి, రాజు, రంజిత్‌రెడ్డి, అశోక్ కారులో ఆలేరు నుంచి మోత్కూరు వెళ్తుండగా తుర్కలషాపురం క్రాస్‌రోడ్డు వద్ద కారు వెనుక స్కూటీపై వస్తున్న వ్యక్తి కారును దాటి(ఓవర్‌టేక్ చేసి) జామ చెట్లబావి వైపు వెళ్లడానికి రైట్‌టర్న్ తీసుకోవడంతో అతన్ని తప్పించబోయి రోడ్డు పక్క ఉన్న హరితహారం బోర్డు ఇనుపకడ్డీని ఢీకొట్టి కారు పల్టీ కొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ భాస్కర్, పైలెట్ అభిలాష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

డిండి, ఫిబ్రవరి 3: విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. ఈ సంఘటన డిండి మండలం తవక్లాపూర్‌లో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన తిరుపతయ్య తన ఆవును వ్యవసాయ పొలంలో కట్టివేసాడు. శనివారం తెల్లవారుజామున ఆవు తాడు తెంచుకొని పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు గడ్డి మేసేందుకు వెళ్లి తెగిపడి ఉన్న విద్యుత్‌వైరుకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఉదయం తిరుపతయ్య పొలం వద్దకు వెళ్లి చూడగా ఆవు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో మృతిచెంది ఉంది. విద్యుత్ శాఖ, గ్రామపంచాయతీ, పశువైద్యాధికారులకు సమాచారం అందించినట్లు బాధితుడు తెలిపాడు. ఆవు విలువ రూ.30వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

కారు అద్దాలు పగులగొట్టి రూ.2లక్షలు చోరీ

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 3: కారు అద్దాలు పగులగొట్టి ముందు సీటులోని బ్యాగులో ఉన్న డబ్బును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలో శనివారం జరిగింది. టూటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... రైస్‌మిల్లర్ గౌరు శ్రీనివాస్ తన వ్యాపార లావాదేవాల కోసం వేములపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్‌నుంచి శనివారం మధ్యాహ్నం రూ.2లక్షలు డ్రాచేసి బ్యాగులో పెట్టుకొని మిర్యాలగూడలోని రామచంద్రగూడెంలోని తన నివాసం వద్దకు వచ్చాడు. మిల్లుకు తిరిగి వెళ్లాలనే ఉద్దేశంతో డబ్బు సంచిని కారులోనే ఉంచి ఇంట్లోకి వెళ్లి పదినిమిషాల తర్వాత కారు వద్దకు చేరుకోగా కారు ముందుడోరు అద్దం పగిలి ఉన్నాయి. గమనించి బాధితుడు బ్యాగును పరిశీలించగా అందులోని డబ్బు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు బాధితుడు శ్రీనివాస్ సమాచారం అందించాడు. ఈ మేరకు డీఎస్పీ వెంకటగిరి ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికులను ఆరా తీశారు. రెండు ద్విచక్రవాహనాలపై గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు శ్రీనివాస్ ఇంటి వద్ద సంచరించినట్లు కాలనీవాసులు పోలీసులకు తెలిపారు. బ్యాంకునుంచి డబ్బు డ్రాచేస్తుండగానే పసిగట్టిన దుండగులు కారును వెంబడించి నగదును తస్కరించుకెళ్లారా.? అనే కోణంలో పోలీసులు విచారణ మొదలుపెట్టారు. ఈ కేసును చేధించేందుకు వేములపల్లి నుంచి మిర్యాలగూడ వరకు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాజగోపాల్

సూర్యాపేట లీగల్, ఫిబ్రవరి 3 : క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఇతర జబ్బుల మాదిరిగా క్యాన్సర్ ప్రారంభదశలో గుర్తించడం కష్టమని, అవగాహన కలిగి ఉండడం ముఖ్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జీ రాజగోపాల్ అన్నారు. సూర్యాపే జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సదుస్సులో మాట్లాడారు. క్యాన్సర్‌తో ఒకరి జీవితమే కాకుండా కుటుంబం మొత్తం ఇబ్బందుల పాలువుతుందన్నారు. కోర్టు ప్రాగణంలో న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి ప్రాథమిక వైద్యపరీక్షలు నిర్వహించారు. సదస్సులో మొదటి జిల్లా అదనపు జడ్జి ఎస్.అమరావతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పీ శ్రీవాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జే ప్రశాంతి, డీఎంహెచ్‌వో కోటాచలం, బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పోలెబోయిన నర్సయ్యయాదవ్ పాల్గొన్నారు.

కేఆర్ఎంబీని ఇచ్చే ప్రయత్నాలు మానుకోవాలి

● రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్



మాట్లాడుతున్న లింగయ్యయాదవ్

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 3: కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ) ను కేంద్ర జలశక్తి బోర్డుకు ధారాదత్తం చేసే ప్రయత్నాలను మానుకోవాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును కేంద్ర జలశక్తి బోర్డుకు అప్పగిస్తారనే వార్తలు వస్తుండడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. జనవరి 17న నాగార్జునసాగర్ డ్యాంపై జరిగిన నీళ్ల వివాదంతో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యులను కేంద్ర జలశక్తి బోర్డు పిలిపించడం జరిగిందన్నారు. సుమారుగా 15 అంశాలను కేఆర్ఎంబీ సభ్యులు జలశక్తి బోర్డుకు చూపారని అన్నారు. కేంద్రజలశక్తి బోర్డు తెలిపిన నిబంధలను పరిశీలన చేస్తే నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఎలాంటి హక్కులు లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రజలశక్తి బోర్డు నిబంధలను వ్యతిరేకించిందన్నారు. మరలా దొడ్డి దారిన కేంద్ర జలశక్తి సంఘం రాష్ట్రంలోని ప్రాజెక్టులపై అజమాయిషి చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తోందన్నారు. బచావత్ ట్రిబ్యునల్ పకారం తెలుగు రాష్ట్రాలకు సాగు, తాగునీటిని సమానంగా వాడుకోవాలని సూచిందన్నారు. కేంద్ర జలశక్తి శాఖ కేఆర్ఎంబీ హక్కులను తీసుకునే ప్రయత్నం చేస్తోందని, దీనిని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేఆర్ఎంబీ హక్కులను యధావిధిగా ఉంచాలని జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానించామన్నారు. ఆయన వెంట జడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, ఎంపీపీ నెమ్మాది భిక్షం పాల్గొన్నారు.

పునరుద్ధరణకు మోక్షం కలిగేనా?

● 20ఏళ్లుగా కొనసాగుతున్న పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వల పనులు ● కాంగ్రెస్ ప్రభుత్వంపైనే రైతుల ఆశలు ● ఇప్పటికే చేపట్టిన పనుల కాంట్రాక్ట్ రద్దు

యాదాద్రి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మూసీలోకి ప్రవహించే ఎగువ వరద నీటిని వినియోగించుకునేందుకు కాల్వల నిర్మాణానికి గత ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. బునాదిగాని, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వల పునరుద్ధరణ పనులు మూడడుగులు ముందుకు ఆరడుగులు వెనక్కి చందంగా మారాయి. 20ఏళ్లుగా ఈ పనులు సాగుతుండగా, సాగు నీటి కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కాల్వల పునరుద్ధరణలో భాగంగా పనులు చేపట్టేందుకు ఇప్పటివరకు ముగ్గురు కాంట్రాక్టర్లు మారారు. మట్టి పనులే తప్ప, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సిమెంట్‌తో కల్వర్టులు నిర్మించిన పాపాన పోలేదు. ఈ కాల్వల పనులు ప్రభుత్వం 61శాతం మేర పూర్తయ్యాయని ప్రకటించింది. కాంట్రాక్టర్లు మట్టి పనులు చేసి చేతులు దులుపుకున్నారు. కల్వర్టులు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఆధునికీకరణ పనులతోపాటు 40శాతం మేర భూసేకరణ చేపట్టాల్సి ఉంది. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా కాల్వల పునరుద్ధరణ పనులు పూర్తయ్యేనా? అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సాగునీటి శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, ఈ మూడు కాల్వల పునరుద్ధరణపై అంచనాలు రూపొందించాలని సూచించారు. మొత్తం రూ.384.43కోట్లతో పూర్తి చేసేందుకు అవకాశం ఉందని అంచనా వేశారు. వీటిలో బునాదిగాని కాల్వ రూ.159.03 కోట్లు, ధర్మారెడ్డి కాల్వ రూ.129.80కోట్లు, పిలాయిపల్లి కాల్వ రూ.95.60కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ మేరకు సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిసి ఈ మూడు కాల్వల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అనిల్ కోరారు. అసంపూర్తిగా ఉన్న ఈ పనులు పూర్తిచేస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని విన్నవించారు. దీంతో రైతులకు ఆశలు రేకెత్తాయి. ముఖ్యమంత్రి, మంత్రి సానుకూలంగా స్పందించినప్పటికీ, ఏ మేరకు నిధులు మంజూరు చేస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

చేపట్టిన పనులను రద్దు చేసిన గత ప్రభుత్వం

మూసీ పరివాహక ప్రాంతంలో చేపట్టిన సాగునీటి కాల్వల పునరుద్ధరణ పనులను గత ప్రభుత్వం రద్దు చేసింది. యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో చేపట్టిన పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో, కాంట్రాక్టును రద్దు చేస్తూ ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాల్వల పునరుద్ధరణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో కాంట్రాక్టర్‌కు ఇరిగేషన్ శాఖ షోకాజ్ నోటీసులు జారీచేసింది. ప్రభుత్వం చెల్లించే ధర తమకు గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్ వెల్లడించడంతో, స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ సమీక్షించి... ముందస్తుగా కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్ణయం తీసుకుంది. ఈ మూడు కాల్వల పునరుద్ధరణకు అసంపూర్తిగా ఉన్న పనులుపై వేర్వేరుగా మరోసారి అంచనాలు రూపొందించాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు తాజా పరిస్థితులపై సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్‌శాఖ అధికారులు సమీక్షించుకుని, రీటెండర్ వేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయితే ఎన్నికలు రావడంతో



భువనగిరి మండలంలోని అనాజిపురం గ్రామ పరిధిలో బునాదిగాని కాల్వ

ఈ కాల్వల పునరుద్ధరణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.


20 ఏళ్లుగా కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురియగానే యాదాద్రిభువనగిరి జిల్లాలో మూసీ పరవళ్లు తొక్కుతుంది. ఈ వరద నీటిని సాగునీటి కోసం వినియోగించుకోవాలనే ఉద్దేశంతో పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డికాల్వలను నిర్మించాలని 2003లో అప్పటి ప్రభుత్వం పనులు ప్రారంభించింది. ఈ కాల్వల ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, భువనగిరి, రామన్నపేట, చౌటుప్పల్, నల్లగొండ జిల్లాలోని చిట్యాల, నకిరేకల్, మండలాలకు సాగునీరు అందుతుంది. పునరుద్ధరణ పనులు సంపూర్ణమైతే రెండు జిల్లాల్లో 98కిలోమీటర్ల వరకు సాగునీరు అందే అవకాశం ఉంది. అప్పటి ప్రభుత్వం మొట్టమొదటిసారి ఈ కాల్వల నిర్మాణానికి రూ.40లక్షలు కేటాయించింది. ఈ నిధులతో రైతులు భూములు నష్టపోకుండా భూముల వెంట కట్టలు కట్టి చెరువుల్లోకి నీరు మళ్లించారు. అయితే నీరు అధిక మొత్తంలో రావడంతో కాల్వల పరిధిని పెంచాలని ప్రతిపాదనలు సిద్ధంచేసి, మరో రూ.7లక్షలు మంజూరు చేసింది. అయితే వీటిలో ధర్మారెడ్డి కాల్వల నిర్మాణం పూర్తిచేశారు. కాల్వలు ఐదు మీటర్లు ఉండటంతో పాటు అనుసంధానంగా కల్వర్టులు నిర్మించకపోవడంతో నీరు చెరువుల్లోకి కాకుండా కత్వనుంచి నేరుగా వాగుల్లోకి వెళ్తోంది. దీంతో తెలంగాణ ఏర్పడిన తర్వాత 2017లో ధర్మారెడ్డి, బునాదిగానీ, పిలాయిపల్లి కాల్వల నిర్మాణంకోసం ప్రభుత్వం రూ.284.85 కోట్లు మంజూరు చేసింది. అప్పటివరకు 20వేల ఎకరాల ఆయకట్టు నుంచి 60వేల వరకు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ నిధుల్లో ధర్మారెడ్డి కాల్వకు రూ.65కోట్ల మేరకు కేటాయించింది. బునాదిగాని కాల్వకు రూ.100కోట్లు, పిలాయిపల్లి కాల్వకు రూ.119.58కోట్లు కేటాయించింది. భూసేకరణతోపాటు కాల్వల పునరుద్ధరణ, కల్వర్టుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. 20ఏళ్లుగా ఈ కాల్వల పనులు ముందుకు సాగడంలేదు. గత ఆరేళ్లుగా నామమాత్రంగా పనులు చేపడుతున్నారే తప్ప.. పూర్తిస్థాయిలో పనులు చేపట్టడంలేదని రైతులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కాంట్రాక్టర్లు మారినప్పటికీ, కాల్వ పనులు 60శాతం కూడా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాల్వలు పునరుద్ధరిస్తే 60వేల ఎకరాలకు సాగునీరు

పిల్లాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణతో యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లోని ఏడు మండలాల్లో 60వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. గత ప్రభుత్వాలు అంచనాల ప్రకారం 50 క్యూసెక్కుల నీరు రైతుల పొలాల్లోకి వెళ్లేది. అయితే 2016లో ప్రభుత్వం కాల్వల పునరుద్ధరణతో 200 క్యూసెక్కులు అందించాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించింది. ధర్మారెడ్డి కాల్వను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తే వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట, చిట్యాల, నకిరేకల్ మండలాల్లోని 49 చెరువులు, కుంటలు నిండుతాయి. ఈ నీటితో మూడు మండలాల్లో 17,500 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఈ కాల్వ పొడవు మొత్తం 51 కిలోమీటర్లకు 102 కల్వర్టులు నిర్మించాలి. పిలాయిపల్లి కాల్వ ద్వారా భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలాల్లో 18 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌తో 46 చెరువులు నిండనున్నాయి. ఈ కాల్వ ద్వారా 22,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. బునాదిగాని కాల్వ 98 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ కాల్వ పునరుద్ధరిస్తే ఏడు మండలాల్లోని 93 చెరువులు నిండనున్నాయి. మొత్తం 20వేలకు పైగా ఎకరాల్లో సాగునీరు అందనుంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించాం



యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో చేపట్టిన పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వల పునర్ధరణకు సాగునీటి శాఖ అధికారులు రూ.384.43 కోట్ల మేరకు అంచనాలు రూపొందించారు. కాల్వలను పునరుద్ధరించేందుకు 2017లో ప్రారంభమైన పనులు నేటి వరకు అసంపూర్తిగానే ఉన్నాయి. అన్ని చోట్ల మట్టి పనులు చేసి కల్వర్టుల నిర్మాణం మరిచారు. చేపట్టనున్న పనులపై అధికారులు తాజాగా రూపొందించిన అంచనాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విన్నవించాం. బడ్జెట్‌లో పనుల పునరుద్ధరణకు నిధులు మంజూరు అవుతాయి.

● భువనగిరి ఎమ్మెల్యే, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

యాదగిరికొండలో భక్తుల సందడి



నిత్యతిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



హైకోర్టు జడ్జి జస్టిస్ శరత్‌కు ప్రసాదాలు అందజేస్తున్న ఈవో

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 3: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు కుటుంబ సమేతంగా క్షేత్రాన్ని సందర్శించి, ఇష్టదైవాలను దర్శించుకుని మొక్కు పూజల్లో పాల్గొన్నారు. దీంతో సేవా మండపాలు, తిరువీధులు, ఘాట్‌రోడ్ తదితర ప్రాంతాలు సందడిగా కనిపించాయి. స్వామివారి ధర్మ దర్శనాల్లో గంట సమయం, ప్రత్యేక దర్శనాల్లో అరగంట సమయం పట్టినట్టు భక్తులు తెలిపారు. స్వామికి నిత్య పూజలు ఘనంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు, యాగశాలలో రుద్ర హవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.22,22,139ల ఆదాయం సమకూరిందని, సుమారు 15వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

స్వామి సేవలో హైకోర్టు జడ్జి జస్టిస్ కె. శరత్

యాదగిరిక్షేత్రాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శరత్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకబృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖ మండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ప్రాకార మండపంలో అర్చకులు ఆశీర్వచనం నిర్వహించగా, దేవస్థాన ఈవో రామకృష్ణారావు ఆయనకు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త నరేష్

గరిడేపల్లి, ఫిబ్రవరి 3: రైతులు ప్రస్తుత కాలంలో ఎరువులు, క్రిమిసంహారక మందులను అధిక మోతాదులో వాడటం వల్ల ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే ఇన్‌చార్జి సీనియర్ శాస్త్రవేత్త డీ నరేష్ అన్నారు. శనివారం మండలంలోని గారకుంటతండా గ్రామంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేంద్రీయ వ్యవసాయంతో వచ్చే పంటకు అధిక ధర లభిస్తుందని, మానవాళి మనుగడుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సేంద్రీయ వ్యవసాయంలో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబునాయక్ శాస్త్రవేత్తలు సిహెచ్. నరేష్, డి.ఆదర్శ్, ఏ.కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్‌లో గ్యాస్‌కు బదులు నీళ్లు !



సిలిండర్ నుంచి

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 3: యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని ఓ వినియోగదారుడికి వంట గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్‌కు బదులుగా నీళ్లు వచ్చాయి. మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన కొయ్యడ కాశీనాథ్ భూదాన్‌పోచపల్లిలోని ధర్మశాస్త్ర ఇండేన్ గ్యాస్ ఇండస్ట్రీస్ వినియోగదారుడు. శనివారం గ్యాస్ పొయ్యి వెలిగిస్తుండగా పొయ్యి వెలగకపోవడంతో గ్యాస్ అయిపోయిందని, గ్యాస్ సిలిండర్‌ను మారుద్దామని సిలిండర్‌ను తొలగించే ప్రయత్నం చేయగా బరువుగా ఉన్నట్లు గమనించాడు. మరోసారి వెలిగించేందుకు ప్రయత్నించాడు అయినా వెలగలేదు. దీంతో సిలిండర్‌ను ఊపి చూడగా అందులో నీళ్ల చప్పుడు రావడంతో సిలిండర్‌ను కిందకు ఒంపగా నీళ్లు వచ్చాయి. దీంతో స్థానిక గ్యాస్ ఏజెన్సీకి ఫోన్ చేశాడు. 'ఇది మా వద్ద సమస్య కాదు.. అప్పుడప్పుడు అలా జరుగుతుంటుంది' అని సమాధానమిచ్చారని వినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

జాతీయ స్థాయి పుస్తక సమీక్షలో ప్రతిభ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3: జాతీయస్థాయి పుస్తక సమీక్ష పోటీల్లో మిర్యాలగూడ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని పాఠశాల హెచ్‌ఎం ఎన్. విజయకుమారి తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన 10వ తరగతి విద్యార్థిని ఏ. మేఘన, 9వ తరగతి విద్యార్థిని కె.మహేశ్వరీల గురువారం అభినందించారు. ఖమ్మం పురిమళ్ల ఫౌండేషన్ నిర్వహించిన జాతీయస్థాయి పుస్తక సమీక్ష పోటీల్లో నగదు బహుమతులు గెలుచుకున్నట్లు నిర్వాహకులు పురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్ రావు పాఠశాలకు సమాచారం అందించారన్నారు. నగదు బహుమతులు గెలుచుకున్న సమీక్షలను సంకలనంగా వెలువరించనున్నట్లు తెలిపారని అన్నారు.

ఇప్పలగూడెంలో వ్యక్తి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, సైదులు(ఫైల్)

కేతేపల్లి, ఫిబ్రవరి 3: గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇప్పలగూడెం గ్రామానికి చెందిన వంటల జానయ్య-లక్ష్మమ్మ దంపతులకు సంతానం లేకపోవడంతో సైదులును దత్తత తీసుకుని సాదుకున్నారు. సైదులు(38) అదే గ్రామానికి చెందిన మేకల అర్చన అనే యువతిని 18 సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సైదులు, అర్చన మధ్య భేదాభిప్రాయాలు రావడంతో ఏడు సంవత్సరాల నుంచి విడివిడిగా జీవనం సాగిస్తున్నారు. భార్య అర్చన హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. చిన్న కుమారుడు తల్లి వద్ద ఉండి హైదరాబాద్‌లోనే ఏడో తరగతి చదువుతుండగా, కూతురు నకిరేకల్‌లోని ఎస్ఎల్‌బీసీ బాలికల గురుకులంలో తొమ్మిదో చదువుతోంది. పెద్ద కుమారుడు చందుతో కలిసి ఉంటూ సైదులు స్వగ్రామంలోనే సెంట్రింగ్, వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 8.30గంటల సమయంలో స్థానిక మద్యం దుకాణం వద్ద మద్యం సేవించి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం సైదులు మండలంలోని గుడివాడ గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రాంగణంలో హత్యకు గురయ్యాడు. సైదులు మృతదేహాన్ని అటుగా వెళ్లే రైతులు చూసి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని శాలిగౌరారం సీఐ రాఘవరావు, ఎస్ఐ శివతేజ పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్స్‌ను రప్పించి వివరాలు సేకరించారు. డాగ్స్ గ్రామంలోని కట్ట మైసమ్మ గుడి వరకు వెళ్లి ఆగిపోయినట్టు తెలిసింది. సైదులు చెవిపై, మొహం, గదమ, ఛాతిపై బలమైన గాయాలు ఉన్నాయి. సైదులుపై కత్తులతో దాడి చేసినట్టు తెలుస్తోందని సీఐ రాఘవరావు వెల్లడించారు. సైదులు కూరుడు చందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివతేజ తెలిపారు.

మారుతున్న జీవన శైలితో క్యాన్సర్ కలవరం

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 3: ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం క్యాన్సర్‌తో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 10లక్షల మందికిపైగా మరణిస్తున్నారు. జీవన శైలిలో వస్తున్న మార్పులు, రెగ్యూలర్ హెల్త్ చెకప్‌లకు దూరంగా ఉండడం, క్యాన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్సలు తీసుకోవడంలో చూపుతున్న నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యంతో రూపకాలలో కాన్సర్ విజృంభిస్తోంది. ఉమ్మడి జిల్లాలోనూ ప్రతి ఏటా క్యాన్సర్‌తో సుమారు 100మంది మృత్యువాత పడుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. చికిత్స నియంత్రణ అవకాశాలు తక్కువగా ఉన్న క్యాన్సర్‌ను ముందస్తు జాగ్రత్తలతోనే నివారణ సాధ్యమవుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. క్యాన్సర్ అవగాహనపై ప్రభుత్వం విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతుండడంతో పాటు మహిళలకు చేస్తున్న స్క్రీనింగ్ టెస్టులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. కాగా ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రికార్డుల ప్రకారం 1305 మంది క్యాన్సర్ పేషంట్లు ఉన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే..

నిర్లక్ష్యం చూపితే ప్రతి 10 మందిలో ఒకరికి క్యాన్సర్ సోకే ప్రమాదం

నేటి ఆహారపు అలవాట్లు, జీవన శైలిని మార్చుకోకుంటే రాబోయే రోజులలో ప్రతి 10 మందిలో ఒకరు క్యాన్సర్ బారిన పడే ప్రమాదాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. స్ట్రీట్ ఫుడ్‌లో రుచికోసం వినియోగించే రసాయణాలు, గుట్కాలు, ధూమ, మద్యపానం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, అధిక బరువు, కనీస శారీరక శ్రమ, లేకపోవడం తదితర సాధారణ కారణాలతోనే పలువురు క్యాన్సర్ బారిన పడుతున్నారు. క్యాన్సర్ అనగానే సాధారణంగా బ్రెస్ట్, గర్భాశయ, నోటి, బ్లెడ్ క్యాన్సర్లే మనకు స్ఫురిస్తాయి. కానీ పదుల సంఖ్యలో క్యాన్సర్లు ఉన్నాయి. క్యాన్సర్‌ను 4 కేటగిరీలుగా పరిగణిస్తూ నాలుగ దశలుగా చికిత్స అందిస్తారు. మొదటి, రెండవ దశలో ఉన్నవారికి తగ్గే అవకాశాలు ఉండగా 3వ దశలో ఉన్నవారు చికిత్సలతో కొద్దికాలం బతికే ఆశలు ఉంటాయి. కానీ 4వ దశలో ఉన్న బాధితుల జీవన ప్రమాణం రెండు మూడు నెలలు మాత్రమే ఉంటుంది. క్యాన్సర్ వైద్య చికిత్సలు, మందుల ధరలు ఖరీదుగా ఉంటాయి. కానీ ప్రభుత్వం కూడా ఎంపిక చేసిన ఆసుపత్రులతో పాటు కొన్ని ట్రస్ట్ ఆసుపత్రులలో చౌక ధరలకు వైద్య చికిత్సలు లభిస్తుండడం ఆర్థికంగా కాస్త ఉపశమనం కలిగిస్తున్న అంశం. ఉమ్మడి జిల్లాలో 3 పాలియేటివ్ హెల్త్ కేర్ సేవా విభాగం సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోనే మొట్టమొదటి సెంటర్‌ను చౌటుప్పల్‌లో ఏర్పాటైంది. కేర్ సెంటర్‌లో బాధితులను చేర్చుకొని సేవలు అందిస్తున్నారు. కేర్ సెంటర్‌కు రాలేని వారికి సిబ్బంది ఇంటికి వెళ్లి సేవలు, చికిత్సలు అందిస్తున్నారు.



● ఉమ్మడి జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం ప్రస్తుతం 1305 మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారు. కానీ వాస్తవంలో మాత్రం కేవలం మౌత్ క్యాన్సర్ బాధితులే సుమారు 5వేల మంది ఉంటారని క్యాన్సర్ బాధితుల సంఘం ప్రతినిధులు పేర్కొంటున్నారు. వీరిలో అధిక మంది హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులలో లక్షల రూపాయలు వెచ్చిస్తూ వైద్య చికిత్సలు పొందుతున్నారని అంటున్నారు.

జిల్లా	బ్రెస్ట్	గర్భాశయ	నోటి	ఇతర
యాదాద్రి భువనగిరి	90	78	17	76
నల్లగొండ	257	349	35	219
సూర్యాపేట	68	46	17	49
మొత్తం	415	473	69	344

సమన్వయంతో అభివృద్ధికి తోడ్పడాలి

● ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి

మర్రిగూడ, ఫిబ్రవరి 3: సమన్వయంతో ప్రత్యేక పాలన అధికారులు గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం ముగిసినందున గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. అధికారులు ప్రజల సమస్యల పరిష్కారం చూపడమే కాకుండా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ముఖ్యంగా అంతంపేట, రాజుపేటతండా పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, నీటి సమస్యను తీర్చాలంటూ ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ లేక చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వేసవి కాలం అయినందన అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ లైన్ వేసి మీటర్లను బిగించాలని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పలు శాఖల వివిధ అంశాలపై చర్చలు నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్, తహసీల్దార్ బక్క శ్రీనివాస్, సూపరింటెండెంట్ యాకుబ్, పలు శాఖల అధికారులు, కార్యదర్శులు, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో విఫలం


పీడీకి సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 3: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో శనివారం జిల్లా సంక్షేమ అధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే పదేళ్ల కాలంలో కార్మికుల రక్షణ కోసం ఉన్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్స్‌ను తీసుకువచ్చిందన్నారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారానికి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు పాదూరి లక్ష్మి, రేణుక, పద్మ, రేణుక పాల్గొన్నారు.

అద్వానీకి భారతరత్న అవార్డుపై హర్షం


జిల్లా వాసులతో అప్పటి ఉపప్రధాని అద్వానీ

నల్లగొండ, ఫిబ్రవరి 3: భారత దేశ మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీకి కేంద్రప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంపై ఏపీసీపీ ఉపాధ్యక్షుడు, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు హర్షం వ్యక్తం చేశారు. 2003 సంవత్సరం మే 3న న్యూఢిల్లీలోని అప్పటి ఏపీభవన్‌లో సూరదాస్ జయంతి సందర్భంగా ఆయనతో తాను వేదికను పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అద్వానీకి భారతరత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3: రోడ్ల నిర్మాణంలో నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ పి.సతీష్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని నల్లగొండ రోడ్డు విస్తరణ పనుల నాణ్యతను శనివారం అధికారుల బృందంతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. నూతనంగా నిర్మిస్తు న్న రోడ్లపై పలుచోట్ల శాంపిల్స్ సేకరించినట్లు తెలిపారు. మంజూరైన వెడల్పులో రోడ్డు నిర్మాణ జరగని ప్రాంతాల్లో కొలతలను తీసుకున్నట్లు చెప్పారు. వెలిదండ- మునగాల రహదారి నిర్మాణం నిబంధనల మేరకు చేపట్టలేదని గుర్తించినట్లు ఆయన తెలిపారు. దీనిపై సంబంధిత సంస్థకు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలి పా రు. తనిఖీల్లో ఆయన వెంట ఈఈ యుగంధర్, ఎస్ఈ దాసు, జేఈ సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టడం ఖాయం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

రామగిరి, ఫిబ్రవరి 3: కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ 13 నుంచి 14 సీట్లు కచ్చితంగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భారతదేశ ప్రజలు మోదీ వైపే చూస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి మీద ఉన్న వ్యతిరేకత వల్లే కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలిచాడు తప్ప ఆయన మీద ప్రజలకు ఏ మాత్రం ప్రేమలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పబ్లిసిటీ ఫుల్ డెలివరీ నిల్ అన్న చందంగా ఉందని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తేనే 6 గ్యారంటీలు అమలవుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొనడం అవి అమలుకావని స్పష్టమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం రైతు రుణమాఫీ కూడా అమలు కాలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లు అడిగే హక్కు కూడా లేదని ఆయన విమర్శించారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలం



మిర్యాలగూడలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాలియా, డిండి, మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 3: మహిళలు, విద్యార్థినులపై దాడులు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ నాగార్జునసాగర్ డివిజన్ కార్యదర్శి కోరె రమేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్‌నాయక్, బుడిగ వెంకటేష్ అన్నారు. శనివారం జిల్లాలోని హాలియా, మిర్యాలగూడ, డిండి మండల కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 10, 11 తేదీల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విద్యార్థినులపై జరిగే దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో ఎంతో కష్టపడుతున్న విద్యార్థినులు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలమైన చట్టాలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌కు అఖిల భారత గర్ల్స్ కన్వీనర్ దీప్తితాదార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కన్వెన్షన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల్లో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి అనేక తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను కఠినంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. కన్వెన్షన్‌కు విద్యార్థినులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● హాలియాలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాగార్జునసాగర్ డివిజన్ కార్యదర్శి కోరే రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్, దోసపాటి నవీన్, ఖమ్మంపాటి సాయి, సౌజన్య, కల్పన, రాధిక, అంజలి, స్వాతి, కావ్య పాల్గొన్నారు.

● డిండి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బాలికల కన్వెన్షన్ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను కఠినంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల్లో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దీపిక, శ్రావణి, అనూష, నందిని, నిర్మల, రాజేశ్వరి, నిఖిత, ప్రవళిక పాల్గొన్నారు.

● మిర్యాలగూడలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు ప్రసన్న మాట్లాడుతూ కన్వెన్షన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైదానాయక్, జగన్, వీరన్న, రమేష్, నగపుష్ప, ఆదిలక్ష్మి, దివ్యప్రసన్న, త్రివేణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలి

శాలిగౌరారం ఫిబ్రవరి 3: కొత్తవారిని మాత్రమే ఓటు నమోదు చేసుకునేలా ప్రతిపాదన పెట్టాలని, నమోదు గడువు తేదీని పెంచాలని టీఆర్ఎస్వీ నాయకులు తోటకూరి వంశీ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రులు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకున్నా తిరిగి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయంలో మెమోలు ఇవ్వాలని అధికారులు ఫోన్లు చేసి గందరగోళం సృష్టించడం సరికాదన్నారు. పాత ఓటర్ల జాబితా యథావిధిగా ఉంచి కొత్తవారికి మాత్రమే నమోదు అవకాశం కల్పించాలన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని కోరారు. ఓటు నమోదుకు గడువు తేదీని నెలరోజులు పొడిగించాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఒక్క పట్టభద్రుడు విధిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన గద్దర్ అవార్డులను తెలంగాణ ఉద్యమకారులుగా స్వాగతిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేముల గోపీనాథ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గద్దర్ అవార్డులను నెలకొల్పినందుకు సీఎం రేవంత్ రెడ్డిని, తెలంగాణ ప్రభుత్వాన్ని తెలంగాణ ఉద్యమకారులంగా ప్రశంసిస్తున్నామన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలకభూమిక


సర్పంచులను సన్మానించిన జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి

మర్రిగూడ, ఫిబ్రవరి 3: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలక భూమిక అని జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అన్నారు. గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసినందున మండల కేంద్రంలో జడ్పీటీసీ ఆధ్వర్యంలో సర్పంచులకు నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా సర్పంచులగా పదవిలో కొనసాగుతూ ప్రజల సమస్యలపై నిరంతరం కృషి చేయడమే కాకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో భాగస్వాములై అభివృద్ధికి కృషి చేశారని, మీ సేవలు మరవరానివని కొనియాడారు. అనంతరం ఎస్ఐ రంగారెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్, తహసీల్దార్ బక్క శ్రీనివాస్ మాట్లాడుతూ సర్పంచులు సమన్వయంతో గ్రామంలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకవచ్చి అధికారులను కూడా అభివృద్ధిలో సమన్వయం చేసి భాగస్వాములు చేశారని, తమకు ఎంతో సహకరించారని కొనియాడారు. అనంతరం సర్పంచులకు పాశం సురేందర్‌రెడ్డి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డీటీ తారక రామన్, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పాక నగేష్‌యాదవ్, సర్పంచులు మమత, చిట్యాల సబితయాదగిరిరెడ్డి, నర్సయ్య, బాలం నర్సింహ, నల్ల యాదయ్యగౌడ్, పందుల పాండు, వెంకటయ్య, ఎంపీటీసీలు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, ఫిబ్రవరి 3: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు కృషి చేయాలని ఎంఈఎఫ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వస్కుల సత్యనారాయణ అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన మాదిగ ఉద్యోగ సమాఖ్య దేవరకొండ డివిజన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మందకృష్ణ మాదిగ జాతి భవిష్యత్తు కోసం ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు ఐక్యంగా కలిసి పనిచేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం మాదిగ ఉద్యోగ సమాఖ్య డివిజన్ కమిటీ నాయకులను టీఎస్టీవో డివిజన్ కమిటీ సభ్యులు ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పులికంటి భాస్కర్, ఉపాధ్యక్షుడు అంజయ్య, దేవరకొండ డివిజన్ ప్రధానకార్యదర్శి బాలరాజు, చాట్ల ఇద్దయ్య, పొట్ట రాములు, జగదీశ్వర్, క్రాంతి, టీఎస్టీవో డివిజన్ కమిటీ అధ్యక్షుడు దాసరి రుణదేవి, మధు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ కేంద్రాల తనిఖీ

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 3: కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శనివారం ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న కేంద్రాలను డీఈసీ సభ్యులు వి.భానునాయక్, కె.నరేంద్రకుమార్, ఎండీ ఇస్మాయిల్ తనిఖీ చేశారు. కొండమల్లేపల్లిలోని ఎస్టీ బాలికల గు రుకుల కళాశాల, సాయి ప్రకర్ష, శ్రీక్రాంతి జూనియర్ కళాశాల లో నిర్వహించిన ప్రాక్టికల్స్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట సీఎస్ దుండిగళ్ల అశోక్, డీవో మర్రి వెంకటయ్య, మధుసూదన్, కృష్ణ, నరేష్, ఏవో ఎర్రమద గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎం యశస్వీ నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

కనగల్, ఫిబ్రవరి 3: మండలంలోని చినమాదారం హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని బొబ్బల కల్యాణి ప్రధాన పీఎం యశస్వీ నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన ఎన్ఎంఎంఎస్‌లో కల్యాణి ఉత్తమ ప్రదర్శన కనబరిచి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించింది. ఇందులో భాగంగా ప్రతిఏటా రూ.75వేల చొప్పున ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు కల్యాణి స్కాలర్‌షిప్‌ను అందుకోనుంది.

ఆరోగ్యమే మహాభాగ్యం : ఎమ్మెల్యే



మినా కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 3: ఆరోగ్యమే మహాభాగ్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య సమాజ ఏర్పాటు కోసం విద్యాలయాల యాజమాన్యాలు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ నిత్య వ్యాయామం చేస్తే రోగాలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. మునిసిపల్ చైర్మన్ భార్గవ్ మాట్లాడుతూ మహిళా కళాశాలను ఏర్పాటు చేసి ఉన్నత విద్యా సేవలందించడంతో పాటు సామాజిక సేవల్లో భాగస్వామ్యులవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ఎండీ. మహిమూద్‌అలీ, డైరెక్టర్ హెప్సీ, డాక్టర్ సమ్మయ, శ్రీవర్ధన్ గంట, శివకుమార్, సురేన్, వెంకటరాజు, కరుణాకర్, వాణి, సబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3: మిర్యాలగూడ పట్టణంలోని టీఎస్ఆర్ గార్డెన్‌లో ఈ నెల 5వ తేదీన బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం నిర్వహించనున్న సమావేశానికి మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. సమావేశం అనంతరం నియోజకవర్గ పరిధిలోని సర్పంచులకు ఆత్మీయ సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, మండల, గ్రామ, వార్డుల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించాలి : గోపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

గుర్రంపోడు, ఫిబ్రవరి 3: సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గుర్రంపోడు మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సర్పంచుల పదవీకాలాన్ని ఆరు నెలల పాటు పొడిగించారని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కూడా పొడిగించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారెంటీల అమలుసాధ్యమని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం సమంజసం కాదని పేర్కొన్నారు. రైతుబంధు రూ.15 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామనడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున ఆరు గ్యారెంటీల అమలు కోసం పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు తరి వెంకట య్య, కోనూరు సైదిరెడ్డి, మేకల నాగిరెడ్డి, వేముల యాదయ్య, సయ్యద్‌మియా, రమేష్, ఇ స్మాయిల్, లింగారెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రం


నల్లగొండలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడరూరల్, చిట్యాల, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేలా కేంద్రం బడ్జెట్‌ను రూపొందించిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు డబ్బీకార్ మల్లేష్, జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. జిల్లాలోని మిర్యాలగూడ, చిట్యాల పట్టణాల్లో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాలను చేపట్టారు. బడ్జెట్‌లో కేంద్రం వ్యవసాయానికి రూ.2.22లక్షల కోట్లు కేటాయించినట్లు చెబుతున్నా వాస్తవానికి కేటాయించింది రూ.1.17లక్షల కోట్లేనన్నారు. కేంద్రం రైతులను, కార్మికులను తీవ్రంగా మోసం చేస్తుందని ఆరోపించారు. గతంలో ఉపసంహరించుకున్న మూడు నల్లచట్టాలను మరోకోణంలో అమలు చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఊర్మిల, కోటిరెడ్డి, చౌగాని వెంక న్న, రామారావు తదితరులు పాల్గొన్నారు

● చిట్యాలలో సీపీఎం అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం కేంద్రప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా బండ శ్రీశైలం మాట్లాడుతూ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు కొమ్ము కాసే విధంగా ఉందని ఆరోపించారు. ఈ నెల 16వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలనీ కోరారు. కార్యక్రమంలో జిట్ట నగేష్, అవిశెట్టి శం కరయ్య, ఐతరాజు నర్సింహ, జోర్రిగల శ్రీనివాసులు, శీలా రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తాటికల్ పీఏసీఎస్ డైరెక్టర్‌గా సైదులు


ఎన్నికైన సైదులును సన్మానిస్తున్న డైరెక్టర్లు

నకిరేకల్, ఫిబ్రవరి 3: తాటికల్ పీఏసీఎస్ డైరెక్టర్‌గా మండలంలోని ఓగోడు గ్రామానికి చెందిన చేతరాజు సైదులు శనివారం ఎంపికయ్యారు. గతంలో ఓగోడు గ్రామం నుంచి పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఎన్నికైన రాచకొండ సునీల్ నకిరేకల్ మునిసిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికవడంతో డైరెక్టర్ పదవికి మూడేళ్ల క్రితం క్రితం రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న డైరెక్టర్ పదవిని పీఏసీఎస్ పాలకవర్గ సమావేశంలో సైదులును మెజార్టీ డైరెక్టర్లు ఆమోదం తెలపడంతో ఎన్నికయ్యారు. పీఏసీఎస్ సీఈవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. డైరెక్టర్‌గా ఎన్నికైన సైదులును వైస్‌చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్లు బచ్చుపల్లి భుజంగరావు, సామసత్తిరెడ్డి, నూకల యశోద, బొప్పని సరోజు, జిల్లా నర్సయ్య ఘనంగా సన్మానించారు. నూతనంగా డైరెక్టర్‌గా ఎన్నుకునేందుకు సమావేశంలో 11 మంది డైరెక్టర్లు హాజరుకాగా డైరెక్టర్ నకిరేకంటి నరేందర్ చేతరాజు సైదులును డైరెక్టర్‌గా సూచించడంతో సామ సత్తిరెడ్డి బలపరచగా మిగతా ఐదుగురు డైరెక్టర్లు ఆయనను ప్రతిపాదించడంతో డైరెక్టర్‌గా ఎన్నికైనట్లుగా సీఈవో ప్రకటించారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, ఫిబ్రవరి 3: గామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బర్రెలక్క (శిరీష), కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం హైదరాబాద్ కేబీకే మల్టీ స్పెషలిస్ట్ హాస్పిటల్స్ జేసీఐ ప్రెసిడెంట్ జమ్ము నగేష్, జోన్ 12 ప్రెసిడెంట్ గోవింద్ కనకాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లకొండ పరమేష్, సింగల్‌విండో వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు చిత్తలూరి జీడికల్లు, గూని వెంకటయ్య, పాకాల సతీష్, లొడంగి మహేష్, అన్నెబోయిన అనిల్, ఆకుల శ్రీనివాస్, రంగు బిక్షం గౌడ్, వేముల భరత్, మిర్యాల సాయి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో పోగొట్టుకున్న మొబైల్ గుర్తింపు

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 3: సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ను పోలీసులు ట్రేస్ చేసి బాధితునికి అందజేశారు. ఈ సంఘటన శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.... మండల కేంద్రానికి చెందిన సుంకర కరుణాకర్ అనే యువకుడు 20 రోజుల క్రితం అడవిదేవులపల్లి నుంచి మిర్యాలగూడకు వెళ్తుండగా మార్గమధ్యలో సుమారు రూ.25వేల విలువైన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో అతను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ ఉన్న చోటును గుర్తించి బాధితుడికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా మొబైల్‌ను పోగొట్టుకున్నా, దొంగలించబడినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా మొబైల్‌ను గుర్తించి బాధితులకు అందజేయనున్నట్లు వెల్లడించారు.

సంక్షిప్త సమాచారం...

దామరచర్ల: రాష్ట్ర బీసీ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కుందూరు రఘువీర్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు రాజారమేష్‌యాదవ్, వెంకటేశ్వర్లు, ఎస్‌డి.ఖాదర్, పడిగపాటి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: చౌక దుకాణాలకు ఈ నెల 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బక్క శ్రీనివాస్ కోరారు. మండలంలో మర్రిగూడ, కుదాబక్షపల్లి, శివన్నగూడెంలో చౌక ధరల దుకాణాల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మర్రిగూడ జనరల్, కుదాభక్షపల్లికి బీసీ, శివన్నగూడెం ఎస్సీలకు కేటాయించారన్నారు. పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికేట్,ఆధార్‌కార్డు, మూడు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దేవరకొండ: పట్టభద్రుల ఓటు హక్కు కోసం అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎండీ సిరాజ్ ఖాన్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మిర్యాలగూడ టౌన్: శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో క్లియో స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్‌ను ఎమ్మెల్యే బీఎల్ఆర్ మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, శ్రీధర్, శ్రీవిద్య, సుధాకర్, నాగేందర్ పాల్గొన్నారు.

● విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని హ్యూమన్ రైట్స్ డిఫెండర్ షేక్ హమీద్ అన్నారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో విద్యార్థులకు హైకోర్టు న్యాయవాది భరత్‌చంద్ర ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● భారత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మహ్మద్ ఖాన్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చాందినీ, ఆఫ్రీన్, చిట్టీ పాల్గొన్నారు.

కనగల్: బోయినపల్లి గ్రామానికి నూతన రేషన్ మంజూరు చేయాలని కోరుతూ బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ తహసీల్దార్ జ్యోతికి గ్రామస్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కారింగు రామచంద్రం, వెంకటేశం, చిత్రం శ్రీను, నూనె సత్తయ్య, రవి, శంకర్, శేఖర్, కిరణ్, నాగరాజు పాల్గొన్నారు.

కట్టంగూరు: దుగినెల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధికారుల పాత్రల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని గురజాల గ్రామానికి చెందిన గుండా లింగయ్య, జగిని పెదసోమయ్య, చిన సోమయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు జగిని రామ్మూర్తి- లీలావతి, చంద్రశేఖర్-ధనలక్ష్మి, జగిని వెంకటేశ్వర్లు-మాధవి, జగిని సోమశేఖర్-విజయ, జగిని ప్రవీణ్‌కుమార్-రాధ, ఊట్కూరి లీలావతి, శ్రీదేవిలు రూ.3లక్షల విలువైన హెల్త్‌సబ్ సెంటర్‌కు కావాల్సిన సామగ్రిని సర్పంచ్ గుండా శ్రీనివాస్, వైద్యాధికారి శిల్పకు అందజేశారు. దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆలకుంట్ల వెంకన్న, పనికర కమలాకర్, పొన్నబోయిన వెంకన్న, రాచకొండ గణేష్, కోక మల్లయ్య, నర్సింహాచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ సూచించారు. కొండమల్లేపల్లిలోని శ్రీకృష్ణవేణి ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయన వెంట పాఠశాల కరస్పాండెంట్ కట్టా వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని ఆకోడ ఎస్.కే ఫౌండేషన్ నిర్వాహకులు కాశీమల్ల పాండురంగయ్య అన్నారు. పట్టణంలోని లెప్రసీ ఆస్పత్రిలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్రాంతికుమార్, వజ్జ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రభుత్వం కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామునగుల్ల అచ్చాలు డిమాండ్ చేశారు. చిట్యాలలో జరిగిన గీత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మామిడి హనుమంతు, గునగంటి కిష్టయ్య, నకిరేకంటి రాములు, ఊడుగు సత్తయ్య, బిక్షపతి పాల్గొన్నారు.

కనగల్: జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా వేసవిలో తాగునీటి అవసరాల నిమిత్తం చెరువులు, కుంటలను నింపేందుకు ఏఎమ్మార్పీ కాల్వకు సాగర్‌నీటిని విడుదల చేయటంపై కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా జిల్లా అధ్యక్షుడు గోలి జగాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలకు రైతుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

హాలియా: హాలియా మునిసిపాలిటీలోని టైం పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులు వివిధ రకాలైన భారతీయ సంప్రదాయాన్ని తెలిపే విధంగా అనేక రకాల వంటకాలు తయారు చేసి పలువురిని అలరించారు. పాఠశాల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే క్రయవిక్రయాలు తెలియాలనే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కత్తి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8, 9 తేదీల్లో చేపట్టనున్న చలో డిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కులగణనే ప్రధాన ఎజెండాగా చేపట్టిన చలో డిల్లీకి కులాలు, పార్టీలకతీతంగా బీసీలందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

దామరచర్ల: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ కోరారు. ఎంపీడీవో, తహసీల్దార్‌కు కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, ఎస్‌కె.జహీర్, సుభాని, సైదులు పాల్గొన్నారు.